# ఇన్లాండ్ లెటర్ కథలు

## షాక్

పరీక్షలు అయిపోవడంతో సెంట్రల్ బస్‌స్టేషన్ ఫుల్‌గా జనంతో క్రిక్కిరిసి కోలాహలంగా హడావుడిగా వుంది. ఇంతలో సూపర్ డీలక్స్ బస్ విజయవాడకు వెళ్ళేది వచ్చి ఆగింది. అంతే జనం బిలబిలమంటూ పరుగున వెళ్ళి తమ తమ కర్చీఫ్‌లను వేసుకుని అనాథరైజ్‌డ్‌గా రిజర్వు చేసుకుంటున్నారు. అయితే అప్పటికే సగానికి పైన సీట్లు రిజర్వు చేయబడినవనే విషయం తెలిసినా, అలా ఎందుకు కర్చీఫ్‌లో వేసుకున్నారో ఎవరికి అర్థంకాలేదు. ఇంతలో కండక్టర్ రావడంతో హైటెక్ లిమిటెడ్ సీట్లు జలజలలుగా వున్నాయి. 1 నుంచి 20 వరకు రిజర్వు అయ్యాయి అని చెప్పడంతో అప్పటి వరకు ఊపిరిపీల్చుకున్న కొంతమంది నిరాశకు గురవడం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి. లత, మంజూ యిద్దరూ రూంమేట్లు అంతే కాదు ఫైనల్ ఎమ్ఎ రెండవ సంవత్సరం యూనివర్సిటీలో చేస్తున్నారు. అనుకోని కారణంగా మంజూ, లతతో అంది 'సారీ లత, నేను కూడా వచ్చేదాన్నే, కానీ టెలిగ్రాం చూశావుగా అందుకు ఈరోజు ఆగి, రేపే వచ్చేస్తాను. ఈ సీటు మరెవరికైనా ఆఫర్ చేసి డబ్బు చేసుకోవచ్చు అనుకుంటూ' అంటున్న మంజు మాటలు విన్న విజయ్! ఇఫ్ షీ ఈజ్ నాట్ హేవింగ్ ఎనీ అబ్జక్షన్ అయివిల్ పర్చేజ్ దిస్ సీట్ మామ్ ప్లైజ్. విజయవాడ వరకు నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తుంది. అతని అణకువ, ప్రాధేయపడడం ఇవన్నీ లతను అభ్యంతరపెట్టకపోవడంతో డబ్బులు ఇచ్చి బ్రీఫ్‌కేస్ ప్రక్కన పెట్టుకొని లత పక్కసీట్లో కూర్చోడం రైట్ రైట్.. అంటూ కండక్టర్ గ్రీన్‌సిగ్నల్‌తో బస్సు మెల్లిగా బయల్దేరింది.

'థ్యాంక్యూ వెరీమచ్ మేడమ్' అన్నాడు విజయ్. ఫుల్‌సూట్‌లో వున్నాడేమో లేంటే డైయింగ్ హాండ్‌సం మోడల్‌లా వున్నాడు. 'ఇట్స్ వెల్కం... అయినా నేను మీకు సీట్ ఆఫర్ చేయలేదే. ఆ థ్యాంక్సు ఏవో మా మంజూకి చెప్తే బాగుండేది.. అయినా ఈ బస్ ఎపిఎస్‌ఆర్‌టిసి వారిది. నాది మాత్రం కాదు. అంది గాలికి ఎగురుతున్న ఘుంగురులను సర్దుకుంటూ. ఎనీవే వన్స్ ఎగైన్ వెరీ మెనీ థ్యాంక్స్ అన్నాడు విజయ్. వినమ్రతతో. యింక సైలెంటుగా కూర్చుండిపోయాడు. లత నుండి ఎలాంటి రిప్లై లేకపోయేసరికి. ఎంత మిస్టర్ హాండ్సమ్ అయితే మాత్రం కనీసం పేరేమిటి? ఏం చేస్తుంటారు? అంటూ కులాసా కబుర్లు చెప్పచ్చుగా అనుకుంది లత. అంతే కాక అలా అర్థం వచ్చేట్టు ఫీలింగ్ ఒకటి ఇచ్చింది. సెంటెడ్ కర్చీఫ్‌తో చిరుచెమటల్ని అద్దుకుంటున్న విజయ్ అప్రయత్నంగా... యువర్ గుడ్‌నేమ్ ప్లీజ్! అన్నాడు. వెంటనే స్పాంటేనియస్‌గా వివరాలు చెప్పింది. నా పేరు విద్యుల్లత. అందరు నన్ను లత అని అంటారు. ఎంఎ ఫైనల్ వ్రాశాను. హాలిడేస్ కదా విజయవాడ వెళ్తున్నా అని సమాధానమిచ్చింది నాన్‌స్టాప్‌గా. తల్లో మల్లెల ఘుమఘుమలు. మరింత అందాన్ని చేకూరుస్తున్నాయి. అసలేం అమె కాలేజి బ్యూటీ ఓ ఐసీ అన్నాడు విజయ్ ముక్తసరిగా. ముఖంలో ఏదో మార్పు మాత్రం గమనించగలిగింది. మరి మీరేం చేస్తుంటారు? అని తనే చొరవ చేసుకుని అడిగింది లత. నా పేరు విజయ్ ఆండ్. ఎంబిఎ చేశాను. స్టేట్‌కి సేల్స్ ఆఫీసర్‌గా చేస్తున్నాను. సాఫ్ట్‌వేర్‌లో పిజి కూడా చేశాను. అమ్మ, నాన్నగార్లు వైజాగ్లో వుంటారు. నాకు మా కంపెనీ ప్రస్తుతం 40,000/- నెలకు పేకేజి యిస్తుంది. అన్నీ వున్నా నేను ఒంటరి వాణ్ణే. 'అదేంటి పెళ్ళి చేసుకోవచ్చుగా' అంది లత. అందులో తన స్వార్థం కూడా కొంతమేళవించి.

'నో...నో... నాకు ఆ ఉద్దేశ్యం ప్రస్తుతం లేదు. వచ్చే నెల్లో నేను అమెరికా యూనిట్ ఆఫీసు మేనజేరుగా కనీసం 3 సంవత్సరాలు అయినా చేసి రమ్మని మా కంపెనీతో నా కాంట్రాక్టు వుంది. మిమ్మల్ని చూడగానే ఏక్సిడెంట్‌లో నేను పోగొట్టుకున్న సునీత... గుర్తొచ్చింది. అచ్చంగా మాట, తీరు ప్రవర్తన అన్నీ మీలో చూడగలిగాను అన్నాడు విజయ్ బాధతో. విద్యుల్లత నిజంగా కరెంట్‌షాక్ తిన్నట్టయింది. స్థాణువుగా మారి తల అటువైపుగా తిప్పుకుంది. డ్రైవర్ బస్‌లైట్లు ఆర్పేసి వేగం పెంచేశాడు.

కోపల్లె కామేశ్వరి

ఖమ్మం.

## ప్లాస్టిక్ పూలు



'ఛ, ఛ వెధవ స్కూటర్ ఎప్పుడూ ట్రబులే.'

గొణుక్కుంటూ స్కూటర్ దిగింది రంజని.

'ఒక్క నిమిషం' స్కూటర దిగి యింజన్‌ను పరిశీలిస్తూ అన్నాడు మాధవ్.

'ఫంక్షన్ టైమైపోతోంది' అసహనంగా వాచీవైపు చూసుకుంటూ అంది రంజని.

'కొంచెం సేపు ఆ చెట్టు కింద నీడలో నిలబడు' అంటూ స్కూటర్ ఎక్కడ ట్రబుల్ పరిశీలనలో వుండిపోయాడు మాధవ్.

'చెట్టుకింద నిలబడితే ఇక అయినట్టే. ఈ డొక్కు స్కూటర్ బాగయినవం పోయినట్టే, నా బతుక్కి తగ్గట్టే వుంది. ఈ స్కూటర్ కూడా' రుసరుసలాడింది రంజని.

స్కూటర్ ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో అటుగా వస్తున్న ఆటోను ఆపాడు మాధవ్. రంజని ఆటో ఎక్కింది.

మండు వేసవి. చుట్టూ కోత కోసిన పొలాలు. వడమటి వడగాడ్పు. దాహంతో నాలుక ఎండిపోతుంది. చుట్టూ చూసాడు మాధవ్. రోడ్డుకు కొంచెం దూరంలో పడిపోయిన బండిని లేపి పరిమోపులు దానిపైకి ఓ ఆడా, మగా ఇద్దరూ కలసి ఎక్కిస్తున్నారు.

స్కూటర్ స్టార్టయ్యేట్టులేదు. రోడ్డు పక్కగా స్కూటర్‌కు స్టాండ్‌వేసి నీళ్ళ కోసం వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు మాధవ్.

'ఏమేవ్, బిందెలో నీళ్ళు కాసిన్ని బాబుగారికివ్వు, తాగుతారు, పాపం దప్పికగా వున్నట్టున్నాడు.'

మోపుకడుతూ భార్యకు చెప్తాడతను. నీళ్లు చెంబుతో తెచ్చి ఇచ్చింది ఆమె.

'అయినా అదేంటి బాబూ. ఇంత ఎండలో నిన్నొక్కన్నే ఇట్లా వదిలేసి వెళ్ళిపోయింది అమ్మాయి, ఆ అమ్మాయికి ప్రాణమెలా ఒప్పింది.'

చెంబు అందుకూంటు అంది ఆమె.

'పిచ్చిదానా, వాళ్లు పట్నపోళ్లే' మధ్యలో అందుకున్నాడు ఆసామి.

మాధవ్ చిన్నగా నవ్వి వెనుదిరిగాడు, బతుకువేగంలో మమతా సౌరభాలు కోల్పోయిన ప్లాస్టిక్ పూల బతుకులు మావి అనుకుంటూ.

—వంశీ, రెంజర్ల.